RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 381 | 21 గురువారం మే 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--



# మండుతున్న ఎండలు..

## – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు

- తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్న సీఎం
- వడదెబ్బకు గురైన వారికి తక్షణ వైద్యం అందించేలా వైద్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశం

తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్న వాతావరణ శాఖ (IMD) హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు. జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశిస్తూనే, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు

## : బండి సంజయ్

నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసని, పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కన్న కొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే తాను కుమారుడిని అప్పగించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను 'మీ చివరి కోరిక ఏమిటి' అని అడిగితే చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటామని అన్నారు. తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందిస్తూ, కేసీఆర్ పార్టీకి లోక్ సభలో ఒక్క ఎంపీ కూడా లేరని అన్నారు. వారు ఫామ్ హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారని అన్నారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది, ఆ కుటుంబ పాలనను అంతం చేసింది తామేనని అన్నారు. అందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.



# చిరంజీవి గొప్ప మనసు..

## ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్



- ఎప్‌సెట్ స్టేట్ టాపర్ రుషిని సత్కరించిన మెగాస్టార్
- ఫస్ట్ ర్యాంక్ వస్తే చిరంజీవిని కల్పిస్తానని తండ్రి ప్రామిస్
- 1986 తర్వాత ఇంజినీరింగ్‌లో టాపర్‌గా నిలిచిన తొలి అమ్మాయి
- రుషి సాధించిన ఘనతకు చిరంజీవి ప్రశంసలు
- ఐఏఎస్ కలకు మద్దతు ఇస్తానని హామీ

2

# 'మోదీ దేశద్రోహి'..

## ప్రధానిపై రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు



ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మోదీ 'దేశద్రోహి' అని విమర్శించారు. దేశాన్ని అమ్మేశారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో ఓ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన మీకు ధన్యవాదాలు. ఇంటికి వెళ్లాక మీ దగ్గరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వచ్చి మోదీ, అమిత్ షా గురించి మాట్లాడితే దీటుగా సమాధానం ఇవ్వండి. మీ ప్రధాని, హోంమంత్రి, మీ సంస్థ దేశద్రోహులని వారికి చెప్పండి. వాళ్లు దేశాన్ని అమ్మేయడానికి పనిచేస్తున్నారని తెలియజేయండి. మన వ్యవస్థలపై దాడి చేస్తున్నారని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, అంబేద్కర్, వీర్ పాసి, మహాత్మా గాంధీని విమర్శిస్తున్నారని చెప్పండి" అంటూ రాహుల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరుగుతాయని రాహుల్ అంచనా వేశారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వ వైఫల్యం వల్ల త్వరలో ఆర్థిక తుపాను రాబోతోందని పునరుద్ఘాటించారు. దీనికి మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్సే కారణమన్నారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని ఆక్షేపించింది. దేశ ప్రజలను రాహుల్ అవమానిస్తున్నారంటూ మండిపడింది.

# కేంద్రంలో బీజేపీ పతనం ఖాయం

## : మమతా బెనర్జీ జోస్యం



బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ త్వరలోనే కేంద్రంలో అధికారం కోల్పోవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. మంగళవారం తన నివాసంలో టీఎంసీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలు, వీధి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటోందని మమత ఆరోపించారు. "మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వీధి వ్యాపారుల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాజ్యాంగ విలువలను కాలరాస్తోంది" అని ఆమె విమర్శించారు. ఇదే సమావేశంలో పాల్గొన్న టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా బీజేపీకి సవాల్ విసిరారు. తన ఇంటిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (ఖవీజ) ఇచ్చిన నోటీసులపై ఆయన ఘాటుగా స్పందించారు. "వారు నా ఇల్లు కూల్చినా సరే.. ఇలాంటి బెదిరింపులకు నేను తలొగ్గేది లేదు. ఏదేమైనా బీజేపీపై నా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నోటీసులు జారీ చేసిన కేఎంసీ ఇప్పటికీ టీఎంసీ నియంత్రణలోనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం సువేందు అధికారిపై అభిషేక్ పరోక్షంగా విమర్శలు చేశారు. "కెమెరా ముందు డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారు" అని 2014 నాటి నారద స్టింగ్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న 'బుల్డోజర్ సంస్కృతి'కి వ్యతిరేకంగా మే 21 నుంచి కోల్‌కతాలో భారీ నిరసనలు చేపట్టాలని టీఎంసీ నిర్ణయించింది.

# కులగణనపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



దేశంలో కులగణన (ఝుర్వ జవఅంబం) ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. జనగణనలో భాగంగా కులాల లెక్కింపును చేపట్టడానికి న్యాయస్థానం లైన్ క్లియర్ చేసింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, వాటిని పూర్తిగా కొట్టివేస్తూ ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కులగణన అనేది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇటువంటి పరిపాలనాపరమైన వ్యవహారాలలో న్యాయస్థానాల జోక్యం ఎంతమాత్రం ఉండబోదని స్పష్టం చేసింది. సమాజంలో వెనుకబడిన జనాభా వివరాలు, వారి సామాజిక స్థితిగతులు కచ్చితంగా తెలిసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా, వాటి సమర్థవంతమైన అమలుకైనా కులగణన అనేది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇది నేటి పరిస్థితుల్లో తప్పనిసరి అని న్యాయమూర్తి పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు ఎంతమంది వెనుకబడిన కులాల వారున్నారో తెలుసుకోవాలని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ కీలక తీర్పుతో దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలకు ఉన్న చట్టపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయినట్లయింది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
21 గురువారం మే 2026

# అవును జాతీయ జంతువుగా ప్రకటించాలి: జమియత్ ఉలేమా చీఫ్

ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించాలని జమియత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ బుధవారం అన్నారు. మైనారిటీ వర్గంపై జరుగుతున్న విద్వేషపూరిత ప్రసంగాలు, దాడుల వెనుక ఈ పవిత్ర జంతువు చుట్టూ అల్లుకున్న విభజన రాజకీయాలే మూలకారణమని ఆయన పేర్కొన్నారు. విద్వేష రాజకీయాలు, పెరుగుతున్న మూకదాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించడం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని మదానీ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరు అడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. దేశంలోని మెజారిటీ వర్గం ఆవును పవిత్ర జంతువుగా మాత్రమే కాకుండా, తల్లిగా కూడా భావిస్తుందని తెలిపారు. ఆవు పేరుతో జరిగే రాజకీయ ఆట ఇకనైనా అంతం కావాలని ఆకాంక్షించారు. మతం పేరుతో జరిగే రాజకీయాల వల్ల ఎవరి ప్రాణాలు పోకూడదని అన్నారు. దేశంలో మత విభజన, విద్వేష రాజకీయాలకు శాశ్వత పరిష్కారం కావాలని అన్నారు. గోమాంసం విషయంలో వివిధ రాష్ట్రాలలో వివిధ చట్టాలు ఉన్నాయని గుర్తు చేశారు. మతవిద్వేషంతో కూడిన దాడులు భక్తి అనబడదని, రాజకీయ కుతంత్రాలు అన్నారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే మత విద్వేష సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇందు కోసం అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన చట్టం ఉండాలని అన్నారు.



# పాకిస్థాన్, ఉగ్రవాదుల భాష: రాహుల్ గాంధీపై బీజేపీ ఆగ్రహం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ సంస్థ 'దేశద్రోహులు' అని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు సూచించడం తీవ్ర దుమారం రేపింది. ఆర్థిక సంక్షోభం వల్ల దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుకుంటూ బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. పొదుపు కోసం పిలుపునిచ్చిన ప్రధానియే వాటిని పాటించడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. రాహుల్ గాంధీ వాడిన భాష పాకిస్థాన్, ఆ దేశానికి మద్దతిచ్చే ఉగ్రవాదుల భాషను పోలి ఉందని బీజేపీ మండిపడింది. ఆయన వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. అక్కడి నేతలు చెప్పినట్లుగానే రాహుల్ గాంధీ మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిని అవమానించడం అతడికి అలవాటుగా మారిందని అన్నారు. రాహుల్ గాంధీ భాష పాకిస్థాన్ నాయకుల్లా ఉందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి ప్రపంచానికి తెలుసని, రాహుల్ గాంధీ నుంచి ప్రశంసలు అవసరం లేదని విమర్శించారు. దేశంలో అశాంతిని రగుల్చాలని రాహుల్ గాంధీ కోరుకుంటున్నారని అన్నారు. కానీ మోదీ, అమిత్ షాలకు ప్రజలు అండగా ఉన్నారని అన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ మరిచిపోకూడదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు. ప్రధానిని అనడం ద్వారా రాహుల్ గాంధీ 140 కోట్ల మంది ప్రజలను దేశద్రోహులుగా పేర్కొన్నట్లే అన్నారు. ఆయన భాష పాకిస్థాన్, ఉగ్రవాదులను పోలి ఉందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కూల్చివేసే పనిని కాంగ్రెస్ చేపట్టిందని సీనియర్ బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ అన్నారు. వాస్తవానికి రాహుల్ గాంధీ ఈ రోజు ఏవైతే మాట్లాడుతున్నారో, నాడు ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీకి వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. అవమానకరమైన భాషను ఉపయోగించడం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రధాని మోదీని దూషించడం, ఆరెస్సెస్‌ను దూషించడం వారికి పరిపాటిగా మారిందని అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు.



# టెట్రా ప్యాక్‌లలోని వోడ్కాపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

టెట్రా ప్యాక్‌లు, సాచెట్ల వంటి గుర్తించలేని ప్యాకేజీలలో మద్యం అమ్మకాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు కేంద్రం స్పందనను కోరింది. ఇటువంటి ప్యాకేజింగ్ వినియోగదారులను తప్పుదోవ పట్టించి, మైనర్ల మద్యపానాన్ని ప్రోత్సహించగలదని పిటిషన్‌దారు పేర్కొన్నారు. కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే లాభాపేక్షలేని సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, పలు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది.

టెట్రా ప్యాక్, సాచెట్లలో వోడ్కా విక్రయాలు వినియోగదారులను తప్పుదారి పట్టిస్తాయని, మైనర్లను మద్యం వైపు ప్రోత్సహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ సంస్థ తరఫున లాయర్ విపిన్ నాయర్ వాదనలు వినిపిస్తూ, అలాంటి అనేక మద్యం ఉత్పత్తుల ప్యాకింగ్‌పై సరైన హెచ్చరికలు ఉండటం లేదని కోర్టుకు తెలిపారు.

అవి పండ్ల రసాలను పోలి ఉండేలా ప్యాక్ చేస్తున్న సందర్భాలు ఉన్నట్లు తెలిపారు. అలాంటి ప్యాకేజీలలో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే విధమైన విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఈ అభ్యర్థనను పరిశీలించింది. ప్యాకింగ్ తప్పుదోవ పట్టించేలా ఉందంటూ కేంద్రం, రాష్ట్రాల్లోని ఎక్సైజ్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది.



# జమిలి ఎన్నికలతో రూ.7 లక్షల కోట్ల ఆదా

## : పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్

దేశంలో 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానాన్ని అమలు చేస్తే సుమారు రూ.7 లక్షల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జేపీసీ) చైర్‌పర్సన్, లోక్‌సభ ఎంపీ పీపీ చౌదరి తెలిపారు. దీనివల్ల దేశ జీడీపీ వృద్ధి రేటు 1.5 శాతం నుంచి 1.6 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. మంగళవారం గాంధీనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో నిరంతరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటంతో దేశం 'ఎన్నికల మోడ్'లోనే ఉంటోందని, దీనివల్ల పాలన, అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని చౌదరి అన్నారు. 1967 వరకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగేవని, కానీ కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు ముందుగా రద్దు కావడంతో ఈ క్రమం తప్పిందని గుర్తుచేశారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించి, ఆ తర్వాత 100 రోజుల్లోగా పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలను పూర్తి చేయాలని తమ కమిటీ సిఫార్సు చేస్తోందని వివరించారు. తరచూ ఎన్నికల వల్ల ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు కేటాయించాల్సి వస్తోందని, దీనివల్ల పాలనాపరమైన పనులు, విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకంపై ఆధారపడిన ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ఎన్నికల వల్ల నష్టపోతోందని పేర్కొన్నారు.

జమిలి ఎన్నికల ప్రతిపాదన రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గానీ, సమాఖ్య వ్యవస్థకు గానీ విరుద్ధం కాదని మాజీ ప్రధాన న్యాయమూర్తులు, సీనియర్ న్యాయ నిపుణులు అభిప్రాయపడినట్లు చౌదరి తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత సంప్రదింపుల తర్వాత 18,000 పేజీలకు పైగా నివేదికను సిద్ధం చేస్తున్నామని, పార్టీ రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ ప్రయత్నం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.



# పురాతన చెన్నకేశవ స్వామి ఆలయ కూల్చివేతపై అధికారుల దర్యాప్తు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
రంగారెడ్డి జిల్లా : కొంగరకలాన్ డివిజన్ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కొంగరకలాన్ 54వ డివిజన్ చింతపల్లిగూడ గ్రామంలో ఉన్న పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అక్రమంగా ధ్వంసం చేశారనే ఆరోపణల నేపథ్యంలో గ్రామస్థులు జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన అధికారులు సంఘటనపై విచారణ ప్రారంభించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం, చింతపల్లిగూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 9, 10, 11, 12లో గాజులబోడు ప్రాంతంలో సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం ఉన్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఈ ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల అదే ప్రాంతంలో "ప్రగతి టౌన్‌షిప్" పేరుతో వెంచర్ అభివృద్ధి చేస్తున్న నిర్వాహకులు ఆలయాన్ని తొలగించారని గ్రామస్థులు ఆరోపించారు. తమకు ఆరాధ్య దైవంగా భావించే దేవాలయాన్ని కూల్చివేయడం వల్ల గ్రామ ప్రజల ఆధ్యాత్మిక భావోద్వేగాలు దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆదిభట్ల మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ బి.ఎన్.కే. రమేష్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అలాగే పోలీసు అధికారులు కూడా ఘటనపై వివరాలు సేకరిస్తూ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక (డీసీవీ) రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు జోగు శేఖర్, నాయకులు ఉడుతల రవి గౌడ్, జోగు స్వామి, జోగు జంగయ్య, శేరి రమేష్ తదితరులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



# చిరంజీవి గొప్ప మనసు..

## ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన మెగాస్టార్

"నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది.

### తండ్రి మాట కోసం

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది.

### 40 ఏళ్ల రికార్డు బద్దలు

రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

### మెగాస్టార్ ఘన సత్కారం

తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు.

### ఐఏఎస్ సంకల్పానికి మద్దతు

ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.

# మురళి నగర్ లో నిధుల కొరత మంజూరు చేయమని కేఎల్ఆర్ కు వినతి పత్రం

హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 20

మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల్ మురళి నగర్ మా గ్రామంలో నిధుల కొరత వల్ల రోడ్డు డ్రైనేజ్ ఐమాక్స్ లైట్స్ ఇతర పనులకు నిధులు మంజూరు చేయమని కేఎల్ఆర్ కు నేహ భాస్కర్ మురళి నగర్ సర్పంచ్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది



నేహ భాస్కర్ మురళి నగర్ సర్పంచిగా బాధ్యత చేపట్టినప్పటి నుండి గ్రామపంచాయతీలో ఎలాంటి డెవలప్మెంట్ చేయలేకపోతున్నామని కేఎల్ఆర్ ను కోరడం జరిగింది

# మురళి నగర్ లో జన జాతీయ గరిమ ఉత్సవం





హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 20

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మురళి నగర్ గ్రామంలో జన జాతీయ గరిమ ఉత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మురళి నగర్ సర్పంచ్ నేహ నేహ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి పక్క ఇండ్లు నల్ల కలెక్షన్ కరెంట్ అర్హులైన వృద్ధులకు పింఛన్ అందజేస్తామని ఈ కార్యక్రమంలో చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి నాయక్ భాను ప్రకాష్ సబితా శీను శారద గ్రామపంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు...

## పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత

తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలోని హన్మకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో కృష్ణా జిల్లాలోని కంకిపాడు, మార్కాపురంలోని నందనమారెళ్ల, 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# కొనుగోలు కేంద్రాల వద్ద ఎవరైనా గొడవలకు దిగిన రైతులను ఇబ్బంది పెట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటం

## వరి ధాన్యం కొనుగోలు గ్రామాలను సందర్శించిన పట్టణ ఎస్.ఐ శ్రీధర్





హైదరాబాద్ ఎస్టేట్ 20మే
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఆదిల్పెట్ , పోన్నారం మరియు గుడిపల్లి వెంకటాపూర్ వరి ధాన్యం కొనుగోలు గ్రామాలను సందర్శించిన పట్టణ ఎస్.ఐ శ్రీధర్. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం గట్టి భద్రతా చర్యలు చేపట్టింది. కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా సాగేలా చూడడమే పోలీసుల ముఖ్య ఉద్దేశం. కొనుగోలు కేంద్రాల వద్ద ఎవరైనా గొడవలకు దిగిన రైతులను ఇబ్బంది పెట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనాల రాకపోకల వల్ల సాధారణ ప్రజలకు వాహనాదారులకు ఇబ్బంది కలగకుండా టాపిక్ ని క్రమబద్ధీకరించడం జరుగుతుంది తెలిపారు. రైతులను మోసం చేసే దళారీలు, మధ్యవర్తులపై గట్టి నిఘా ఉంచాం, అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. రైతులు ఐకెపి సిబ్బంది మరియు మిల్లుల యజమానులు పోలీసులకు సహకరించి కొనుగోలు ప్రక్రియ ను విజయవంతం చేయాల్సిందిగా కోరుచున్నాము.

# నాలుగు దశాబ్దాల అనంతరం ఆత్మీయ కలయిక నిర్వహించిన పూర్వ విద్యార్థులు



హైదరాబాద్ ఎస్టేట్ 20మే
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల 1981-82 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు నాలుగు దశాబ్దాల అనంతరం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవిత ప్రయాణంలో వివిధ దారులు పట్టిన సహపాఠులు మళ్లీ ఒకే వేదికపై కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1981-82లో పదో తరగతి పూర్తి చేసిన అనంతరం కొందరు సహపాఠులు అప్పుడప్పుడూ కలుసుకునే అవకాశం వచ్చినప్పటికీ, మరికొందరు విద్య, ఉద్యోగం, వ్యాపారం, వివాహం తదితర కారణాలతో వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడ్డారు. అయినప్పటికీ పాఠశాల రోజుల్లో గడిపిన సంతోష క్షణాలు, స్నేహితుల మధ్య ఉన్న అనుబంధం, ఉపాధ్యాయుల ఆప్యాయత, తరగతి గదుల్లో జరిగిన మధుర సంఘటనలు ఇప్పటికీ వారి మదిలో చెరగని ముద్రగా నిలిచాయని వారు పేర్కొన్నారు. గత 43 సంవత్సరాలుగా జీవన పోరాటంలో కుటుంబ బాధ్యతలు, ఉద్యోగాలు, పిల్లల భవిష్యత్తు వంటి అంశాలతో బిజీగా గడిపిన తమ జీవితాల్లో, మరోసారి పాత మిత్రులతో కలిసి ఒకరోజు గడపడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సమ్మేళనం ద్వారా పాత స్నేహాలను మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు ఉపాధ్యాయులను స్మరించుకునే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు విశేషంగా సహకరించిన సీహెచ్ రాజిరెడ్డి, నాగమల్లేశ్వరరావు, ఎం. రామ్మూర్తి, డి. వెంకటేశ్వర్లను ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయాన్ని నిర్వాహకులు అనసూయ, అబ్దుల్ రజాక్, ఆగష్టిన్ వెల్లడించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థుల జీవితాల్లో మరో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమీక్ష



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
రంగారెడ్డి జిల్లా, జిల్లాలో తప్పులు లేని పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకతతో అమలు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ప్రతి బూత్‌కు వెంటనే బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

జూన్ 15 నుంచి బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి సమగ్ర విచారణ చేపడతారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపు వంటి ప్రక్రియల్లో బీఎల్‌ఓల బాధ్యత కీలకమని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే యువతీ యువకులు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, సవరణలు, చిరునామా మార్పులు వంటి అంశాలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎత్తైన అపార్ట్‌మెంట్ భవనాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నకిలీ ఓటర్లు మరియు మరణించిన వారి పేర్లను తొలగించాలని కోరారు. బీఎల్‌ఓ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఒకే ఇంటి నంబరుపై అధిక సంఖ్యలో ఓటర్లు నమోదైన కేసులను విచారించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా SIR-2002 ఓటర్ల జాబితా ప్రతులను రాజకీయ పార్టీలకు అందించాలని, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, పర్యవేక్షకులకు ముందస్తు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఓటర్ల గణన పత్రాలను కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా అందజేయాలని, డేటా ఎంట్రీలో కచ్చితత్వం పాటించాలని కోరారు.

ఈ సూచనలపై స్పందించిన జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నకిలీ, మరణించిన ఓటర్ల తొలగింపుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఎత్తైన భవనాల్లో సాధ్యమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే, ఒకే ఇంటి నంబరులో అధిక సంఖ్యలో నమోదైన ఓటర్ల వివరాలను విచారించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాబోయే వారంలో బీఎల్‌ఓలు, పర్యవేక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. +ఎవీజ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, బీఎల్‌ఓల సమాచారం సంబంధిత అధికారుల నుంచి సేకరించి రాజకీయ పార్టీలతో పంచుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత మరియు ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## కాంగ్రెస్ పార్టీ అంబర్ పేట ఇంచార్జీ రోహిన్ రెడ్డి



కాచిగూడ: వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సంఘటితంగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అంబర్ పేట ఇంచార్జీ రోహిన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోహిన్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో అంబర్ పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. రోహిన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి దేవిరెడ్డి విజితారెడ్డి, లక్ష్మణ్, టీపీసీసీ సోషల్ మీడియా అంబర్ పేట నియోజకవర్గం కో ఆర్డినేటర్ రాజ్ కిరణ్ మామిడాల, తదితరులు ఉన్నారు.

# బీసీ వర్గాలకు ఊరటనిచ్చిన సుప్రీంకోర్టు వ్యాఖ్యలు


## జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



హైదరాబాద్, మే 20: దేశ వ్యాప్తంగా కులగణనపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు బీసీ వర్గాలకు ఆశాకిరణంగా మారాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కాచిగూడలో బీసీ సంఘాల సమన్వయ జేఏసీ ఆధ్వర్యంలో నర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులగణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన అవసరం అని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం సామాజిక న్యాయ పోరాటానికి పెద్ద ఊరటనిచ్చిందని అన్నా. దశాబ్దాలుగా బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని, బీసీ అసలు జనాభా, వెనుకబాటుతం అవకాశాలపై సరైన గణాంకాలు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కులగణన అంటే దేశాన్ని విభజించడం కాదని, ఇప్పటి వరకు జరిగిన అసమానతలను గుర్తించి అణగారిన వర్గాలకు న్యాయం చేయడమేనని కుమారస్వామి పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం నిజాలను దాచకూడదన్న సుప్రీంకోర్టు సందేశాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించి దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# దేవాలయ ప్రాంగణంలో అన్యమత ప్రచార పుస్తకాల కలకలం..

## భక్తుల్లో ఆగ్రహం,



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అనుమానాస్పదంగా అన్యమత ప్రచార పుస్తకాలు కనిపించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో భగవద్గీత పేరుతో ఉంచిన కొన్ని పుస్తకాలను పరిశీలించిన భక్తులు, అవి బైబిల్‌కు సంబంధించిన ప్రచార కాపీలుగా గుర్తించినట్లు సమాచారం. దీంతో ఒక్కసారిగా ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హిందూ దేవాలయ ప్రాంగణంలో ఈ విధంగా ఇతర మతాలకు సంబంధించిన ప్రచార పుస్తకాలు ఎలా చేరాయన్న దానిపై భక్తులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ఈ కాపీలను అక్కడ ఉంచి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి చర్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల ఇదే ప్రాంతంలోని ఈశ్వర్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కూడా ఇలాంటి అన్యమత ప్రచార పుస్తకాలు లభ్యమైన ఘటన వెలుగులోకి వచ్చిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. వరుసగా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో భక్తుల్లో ఆందోళన మరింత పెరిగింది. ఆలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇటువంటి ఘటనలను తేలికగా తీసుకోవద్దని వారు కోరుతున్నారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులను స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు మరింత బలోపేతం చేసి, సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు త్వరలోనే స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు సేకరించనున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
21 గురువారం మే 2026

## మహేశ్వరం మండలంలో పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం రంగంలోకి మహేశ్వరం ఏఈ చక్రపాణి



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 20:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని మహేశ్వరం ఏ ఈ చక్రపాణి మాట్లాడుతూ పలు గ్రామాలలో మంగళవారం సాయంత్రం వర్షంతో పాటు ఈదురుగాలులు రావడంతో రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో వెంటనే స్పందించి అర్ధరాత్రి దగ్గరుండి పనులు చేయించారు.. తాను సైతం స్వయంగా సేవలు చెట్ల కొమ్మలు తీసివేయడం లాంటివి చేయడం జరిగింది . రాత్రికి రాత్రే కరెంటు తీగలు తెగి పడడంతో వెంటనే వాటిని సరి చేయడం జరిగింది అన్నారు అంతే కాకుండా 8 విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో లైన్ తెగిపోవడం భారీ వృక్షాలు లైన్లో పైన పడిన వెంటనే తొలగించామని తెలియజేశారు అర్ధరాత్రి సమయంలో వెంటనే స్పందించి సిబ్బందితోపాటు మహేశ్వరం ఏ ఈ చక్రపాణి రాత్రి సమయంలో తీవ్రంగా కృషి చేశారు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు మహేశ్వరం ప్రజానీకం తెలియజేశారు

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఇమ్మడి దశరథ
### నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు బీర్ల అయిలయ్య



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి గుండాల 20 మే 2026.
గుండాల మండలం తురకల షాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇమ్మడి దశరథకు గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి దక్కింది. బుధవారం వివేరా హోటల్ లో జిల్లా సమావేశం జరిగింది ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు డి సి సి అధ్యక్షులు బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ఇమ్మడి దశరథకు గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాజీ డిసిసి అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి జనగాం ఉపేందర్ రెడ్డి మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరా సరుపు యాదగిరి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏలూరు రామ్ రెడ్డి రాష్ట్ర హజ్ కమిటీ నెంబర్ ఎండి షర్ఫుద్దీన్, సీతారాంపురం గ్రామ శాఖ అధ్యక్షులు బొర్రెమ్ వెంకట్ రెడ్డి,కెమీడి ఉపేందర్ దొడ్డబోయిన నరేష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా, మే 20: ఎంజిఎన్ఆర్ఇజిఎన్, మహిళా స్వయం సహాయక సంఘాలు, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్ఎఫ్బీఎస్) తదితర అంశాలపై బుధవారం రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష చేపట్టారు.
ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వేగవంతం చేయడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొత్త జాబ్ కార్డులను మంజూరు చేసి, కూలీలు పూర్తి స్థాయిలో పని దినాలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, చేయూత పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూడీఐడీ (యూనిక్ డిసేబులిటీ ఐడెంటిటీ) కార్డులపై విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులందరికీ అందేలా చూడాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్లో లేబర్, వేజ్ కాంపోనెంట్ల పనులను ఎంపీడీవోలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల భాగంగా జిల్లాలో 287 వివో భవనాలకు మంజూరు లభించగా, వాటిలో ఇంకా 89 భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు.
అలాగే, పేమెంట్ల కోసం జనరేట్ చేసిన ఐడీల ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం కింద కుటుంబ పెద్ద మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తోందని, అర్హులైన కుటుంబాలకు ప్రయోజనం చేరేలా ఎంపీడీవోలు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు.
రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి మండలంలో డ్రైవ్ మోడ్లో నిర్వహించి, కనీసం 200 మంది సభ్యులను చేర్చాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు సాధించిన డీఆర్డీఏ అధికారులను కలెక్టర్ అభినందించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేశ్ మోహన్, అడిషనల్ పీడీ సుభాషిణి, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎర్రజెండా రెపరెపలాడితేనే కార్మికుల సంక్షేమం సంపూర్ణం
### వాసిరెడ్డి సీతారామయ్య అధ్యక్షతన ముగిసిన 14వ జాతీయ మహాసభలు




హైదరాబాద్ ఎస్టేట్ 20మే
ఒడిస్సా రాష్ట్రంలోని పూరి నగరంలో ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ 14వ జాతీయ మహాసభ ఘనంగా నిర్వహించబడింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా అమరజీత్ కౌర్ మరియు రామేంద్ర కుమార్, హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ రామేంద్ర కుమార్ కార్యదర్శి నివేదికను సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తులో బొగ్గు గని కార్మికులు తీవ్రమైన సవాళ్లు మరియు ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. కార్మికులందరూ ఐకమత్యంగా ఉండాలని, "బటోగే తో మీటోగే" అనే హెచ్చరికను నాయకులకు మరియు కార్మికులకు గుర్తుచేశారు. బొగ్గు గని కార్మికుల హక్కుల సాధన కోసం జరిగిన ఎన్నో పోరాటాల్లో ఏఐటియుసి పెద్దన్న పాత్ర పోషించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రాబోయే జేబీసీసీఐ సమావేశంలో 12వ వేజ్ బోర్డు సాధనలో కూడా ఏఐటియుసి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా లేబర్ కోడ్ల రద్దు కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో ఏఐటియుసి విజయవంతమైన పోరాటం నిర్వహించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మికులు ఐక్యంగా పోరాడి సిపిఐ పార్టీ ఎమ్మెల్యేను గెలిపించుకున్నందుకు సభలో ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి కార్మికులను మరియు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకత్వాన్ని మిగతా రాష్ట్రాల నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్మికుల హక్కులు మరియు సంక్షేమం కోసం ఏఐటియుసి నాయకులు నిరంతరం పోరాడాలని, యాజమాన్యాన్ని ప్రశ్నించడంలో ఎప్పటికప్పుడు ముందుండాలని పిలుపునిచ్చారు. నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా ఎర్రజెండా మరియు ఏఐటియుసి యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. ౦
బొగ్గు గనుల్లో ఎర్రజెండా రెపరెపలాడితేనే కార్మికుల సంక్షేమం, హక్కులు శాశ్వతంగా పరిరక్షించబడతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి నుంచి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య అధ్యక్షతన 1వ మాసభ జరిగినది, ఈ మాసభల లో అన్ని ఏరియాల నుంచి సుమారు 45 మంది కేంద్ర కమిటీ నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ లు పాల్గొన్నారు. అలాగే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి కోల్ ఇండియా నాయకులు పాల్గొని జాతీయ మహాసభలను విజయవంతం చేశారు.
మందమర్రి ఏరియా నుండి ఎండి అక్బర్ అలీ, శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, భీమనాథుని సుదర్శన్, దాసరి తిరుపతి గౌడు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ నివారణకు అప్రమత్తత అవసరం,
### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి సూచించారు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
జిల్లాలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి సూచించారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఐఏఎస్ సూచనల మేరకు విడుదల చేసిన ప్రకటనలో వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు వడగాలుల ప్రభావం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. తగిన జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బకు గురై ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు రోజూ సమృద్ధిగా నీరు తాగాలని, కనీసం నాలుగు నుంచి ఐదు లీటర్ల వరకు ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. కొబ్బరి నీరు, మజ్జిగ, పండ్లరసాలు వంటి పానీయాలు శరీరానికి చల్లదనం అందిస్తాయని పేర్కొన్నారు. లేత రంగుల కాటన్ దుస్తులు ధరించడం మంచిదని, నలుపు రంగు, మందపాటి దుస్తులను దూరంగా ఉంచాలని తెలిపారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ రోజుకు రెండు సార్లు స్నానం చేయాలని సూచించారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ తీవ్రత అధికంగా ఉండేందున అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకపోవడమే మంచిదన్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, స్కార్ఫ్ వంటి రక్షణ సాధనాలు ఉపయోగించాలని, వెంట తాగునీటి సీసా తీసుకెళ్లాలని సూచించారు. ఎండలో తిరిగి వచ్చిన వెంటనే కొద్దిసేపు నీడలో విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత మాత్రమే నీరు తాగాలని చెప్పారు. రోడ్లపై లభించే రంగు పానీయాలను తీసుకోవద్దని, మద్యం సేవనాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. మాంసాహారం తగ్గించడం ద్వారా శరీరంపై వేడి ప్రభావం తగ్గుతుందని తెలిపారు. ఇళ్లలో గాలి సరిగా వచ్చేలా కిటికీలు తెరిచి ఉంచి ఫ్యాన్లు ఉపయోగించాలని పేర్కొన్నారు. వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స
వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని లేదా నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి. తడి గుడ్డతో శరీరాన్ని తుడవడం ద్వారా శరీర ఉష్ణోగ్రత తగ్గించే ప్రయత్నం చేయాలి. ఫ్యాన్ గాలి లేదా చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వవచ్చని తెలిపారు. అయితే అపస్మారక స్థితిలో ఉన్న వారికి బలవంతంగా నీరు తాగించకూడదని హెచ్చరించారు. పరిస్థితి విషమంగా ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలని వైద్యశాఖ సూచించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన చిలుక మధుసూదన్ రెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
హైదరాబాద్లో వెలుగులోకి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కొనసాగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో భాగంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి గురువారం బషీర్బాగ్లోని సిట్ కార్యాలయానికి హాజరయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఘటనలకు సంబంధించిన అంశాలపై సాక్ష్యాలు సేకరిస్తున్న అధికారులు ఆయనను విచారణకు పిలిపించినట్లు సమాచారం.
బషీర్బాగ్ పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కాలంలో తన కదలికలపై అప్పటి అధికార యంత్రాంగం నిఘా పెట్టిందని, వ్యక్తిగత ఫోన్ సంభాషణలు కూడా గమనించబడినట్లు తనకు అనుమానం ఉన్న విషయాలను అధికారులకు వివరించినట్లు చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు.
ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని పేర్కొంటూ, ప్రతిపక్ష నాయకులు మరియు రాజకీయ కార్యకర్తలపై అక్రమ నిఘా కొనసాగించారని ఆరోపించారు. ఈ కేసులో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్రపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. సిట్ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు తాను సమాధానాలు ఇచ్చినట్లు, తన వద్ద ఉన్న సమాచారం మొత్తం దర్యాప్తు బృందానికి అందజేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు.

## శేరిగూడ జెడ్పీహెచ్ఎస్ అభివృద్ధికి రూ.50 వేల ఆర్థిక సహాయం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
శేరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్ల శ్రీశైలం గౌడ్, తమ వంతు సహకారంగా రూ.50,000లను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు, అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన తాళ్ల శ్రీశైలం గౌడ్, విద్యాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలంటే ప్రజాప్రతినిధులు, దాతలు, స్థానిక నాయకులు సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ కి రూ.50 వేల చెక్కును అందజేసిన సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల అవసరాలను గుర్తించి ఉదారంగా విరాళం అందించిన తాళ్ల శ్రీశైలం గౌడ్ కి ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం ద్వారా పాఠశాలలో అవసరమైన విద్యా సామగ్రి, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పాఠశాల వర్గాలు వెల్లడించాయి. స్థానిక నాయకులు విద్యారంగ అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
21 గురువారం మే 2026

# జర్నలిస్టుల సమస్యలపై జాప్యం తగదు

## – సమస్యలను ఇకనైనా పరిష్కరించండి

## – రాష్ట్ర ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్

## – రాష్ట్ర కేబినెట్ లో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి



హైదరాబాద్, మే 20: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఈనెల 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్ళలో దాదాపు ముప్పై సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగాయని, కానీ ఇంతవరకు ఏ ఒక్క మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చ జరపలేదని అన్నారు. కనీసం రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలోనైనా జర్నలిస్టు ప్రధాన సమస్యలపై చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయినా.. ఇంతవరకు కొత్త అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ పూర్తికాలేదని, జీవో 252 జారీ చేసిన గత నాలుగు మాసాల్లో మూడు సవరణలు ఆరు అభ్యంతాలు, కోర్టు కేసులతో అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నత్తనడకలా సాగుతుందని అన్నారు.జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. హెల్త్ కార్డులు లేక అనేకమంది జర్నలిస్టులు ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యం లబించక ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు గత రెండేళ్లుగా ప్రభుత్వం జారీచేసిన అడ్వర్టైజ్మెంట్స్ బిల్లులు ఇవ్వలేదని, బిల్లుల బకాయిలు చెల్లించకపోగా, అడ్వర్టైజ్మెంట్స్ ఇవ్వడం కూడా ఆపేసారని ఆయన ధ్వజమెత్తారు. రెండేళ్లుగా బిల్లులు రాక అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, చాలా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ళు జర్నలిస్టుల జీవితాలతో చెలగాటం ఆడిందని.. చిన్న, మధ్య తరహాపత్రికలను అణిచివేసిందని, ఈ ప్రభుత్వం కూడా అదే పద్దతిలో వ్యవహరిస్తున్నదని మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త మీడియా పాలసీ చేస్తామని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలిస్తామని, అక్రెడిటేషన్ కార్డులు, ఆరోగ్య భీమా పథకం కార్డులు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళు ్లగా ఏదీ అమలు చేయలేదని అన్నారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపకుండా సానుకూలంగా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర రాజధానిలో ఎటువంటి వివక్ష, వివాదం లేకుండా, సాంకేతికపరమైన సమస్యలు ఎదురుకాకుండా అర్హులైన జర్నలిస్టులందరికి త్వరితగతిన ఇళ్ళస్థలాలు కేటాయించాలని ఆయన కోరారు.

# కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క బేటీ..!



న్యూఢిల్లీ, మే 20: హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ,
దాచేపల్లి రవి తెలంగాణ రిపోర్టర్స్ ఇంచార్జి

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై ,రాష్ట్ర అభివృద్ధి, విద్యా మౌలిక వసతులు, మూలధన వ్యయాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.. ఈ సందర్భంగా »»Scheme for Special Assistance to States for Capital Investment (SASCI)μμ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న భారీ పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు.అలాగే, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (YIIRS) సహా విద్యా రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడులకు సంబంధించి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ (DEA) ఆమోదించిన విదేశీ ద్రవ్య సహకార(జూూ) ప్రాజెక్టులకు ఖీ=దీవీ పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హెరిటేజ్ వాక్ నిర్వహించిన మండల పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 20:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హెరిటేజ్ వాక్ మండల పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి, ఆధ్వర్యంలో మహేశ్వరం అంబేద్కర్ చౌరస్తా నుండి కొనేరి మెట్ల బావి సందర్శించి శివగంగా ఆలయ నుండి గడికోట ప్రాంగణంలో శిధిలా వ్యవస్థకు చేరుతున్న బావి పరిశుభ్రత గురించి చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత, జిల్లా పర్యాటక అధికారి ఎస్ ప్రభాకర్, ఆర్కాలజీ అధికారి సుభాష్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ అధికారులు, మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్, అల్లే బిక్షపతి, శివగంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, బిఆర్ఎస్ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు కటికల మహేందర్ ముదిరాజ్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రావణ్ కుమార్,గ్రామపంచాయతీ సభ్యులు టీ బేబీ మక్కాజి, పోల్కం సునీత మహేందర్, ఆవుల కాడి కిష్టమ్మ శ్రీశైలం, స్వర్ణ గంటి సంజీవ, కడమోని స్వాతి ప్రభాకర్, ఒత్తుల శాలిని సన్నీ కుమార్, కాకి పరమేష్ ముదిరాజ్, ఆకుల వీరి బాబు, సున్నం స్వప్న కృష్ణ, జటావత్ రూకేష్ నాయక్, మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కర్రెల రాములు ముదిరాజ్, స్వర్ణ గంటి సుభాష్, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్లు పేయ్యల దేవేందర్, ఏపూరి సాయిలు, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ శేఖర్. కంప్యూటర్ ఆపరేటర్ రాజు నాయక్, కరోబార్ గోల్కొండ శంకరయ్య, గడికోట పర్యవేక్షకుడు జోల శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు గద గూటి హరికృష్ణ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణగంటి ఆకాష్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ 10 వ





ఇన్చార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్,13 వ వార్డు ఇంచార్జ్ అనిల్ నాయక్,14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు,గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా హెరిటేజ్ వాక్ నిర్వహించారు

# గాయపడిన పైడిరాజుకు అండగా బలిరెడ్డి అప్పారావు



పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం మండలం గాలి భీమవరం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన పినిశెట్టి పైడిరాజును జనసేన పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కనీస వేతన సలహా మండల డైరెక్టర్ బలిరెడ్డి అప్పారావు పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న అప్పారావు మానవతా దృక్పథంతో స్పందించి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టసమయంలో బాధితులకు అండగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సేవ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.గ్రామ ప్రజలు, ఎన్డీఏ కూటమి నాయకులు అప్పారావు సేవాభావాన్ని అభినందించారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సహాయం అందించడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గాలి భీమవరం గ్రామ ఎన్డీఏ కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మహేశ్వరం ప్రజా సమస్యలపై మంత్రి శ్రీధర్ బాబుకు వినతులు అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 20:-
మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రాలు సమర్పించారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెరిగిన ఆస్తి పన్నుల వల్ల ప్రజలపై ఆర్థిక భారం అధికమవుతోందని పేర్కొంటూ వాటిని తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బడంగ్‌పేట్ ప్రాంతంలో ఉన్న 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించాలని కోరారు. పేదలకు నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులను వేగవంతం చేసి అర్హులైన కుటుంబాలకు త్వరగా కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బలాపూర్ చౌరస్తాలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పబ్లిక్ స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయడానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అల్మాస్‌గూడ ప్రాంతంలో గ్రీన్ జోన్, రెసిడెన్షియల్ జోన్‌కు సంబంధించిన హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్లమ్ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ ద్వారా ప్రతి ఇంటికి 20 లీటర్ల ఉచిత మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ అంశాలన్నింటినీ సానుకూలంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చినట్లు సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో మీర్‌పేట్ కాలనీల సంఘాల ప్రతినిధులు, బడంగ్‌పేట్‌మీర్‌పేట్ ప్రాంతాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# నేడు మెడికల్ షాపులు బంద్



అఖిల భారత కెమిస్ట్రీల సమైక్య ఆల్ ఇండియా ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 20 బుధవారం నాడు అన్ని మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు ఈశ్వరరావు మీడియాకి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించి కరపత్రాలను సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ ఆన్లైన్లో మందులు అమ్మకాలు నిలిపివేయాలని కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లు నిలుపుదల చేయాలని నకిలీ మందులు అమ్మకాలు నివారించాలని జీఎస్సార్ 220 జీవోలను ఉపసంహరించుకోవాలని డిమాండ్లతో ఈ బంద్ చేపడుతున్నామని అన్నారు. కావున దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన వారు ముందుగా మందులను సమకూర్చుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎన్ ఎస్ ప్రసాద్ గుప్తా, కోశాధికారి వై. సతీష్ కుమార్, పెతకంశెట్టి శివ , జ్యోతుల గణేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in





# జపాన్‌పై ప్రేమతో..

## తన కొత్త స్నేహితులను పరిచయం చేసిన ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన పుట్టినరోజున అభిమానులకు ఓ ప్రత్యేకమైన కానుక ఇచ్చారు. తన ఇంట్లోకి కొత్తగా వచ్చి చేరిన ఇద్దరు స్నేహితులను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పరిచయం చేశారు. అవి రెండు అందమైన పక్షులు. వాటికి 'అసాహి', 'యూహీ' అని నామకరణం చేశారు. ఈ పేర్లు జపాన్‌పై తనకున్న ప్రేమకు ప్రతిబింబం అని తారక్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో 'దేవర: పార్ట్ 1' సినిమా ప్రమోషన్స్ కోసం ఎన్టీఆర్ జపాన్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అక్కడి అభిమానులు చూపిన అపూర్వ ఆదరణకు ఆయన ఫిదా అయ్యారు. ముఖ్యంగా 'ఆర్ఆర్ఆర్' సినిమా చూసి ఓ జపాన్ అభిమాని తెలుగు నేర్చుకున్నారని తెలిసి ఎంతో కదిలిపోయానని అప్పట్లో ఓ వీడియోలో పంచుకున్నారు. 2022లో 'ఆర్ఆర్ఆర్' చిత్రం జపాన్‌లో ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇక సినిమాల విషయానికొస్తే, ఎన్టీఆర్ తన తదుపరి చిత్రం 'డ్రాగన్'తో రాబోతున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో గ్లోబల్ ఓపియం యుద్ధం నేపథ్యంలో సాగే కథలో, ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన ప్రధాన హంతకుడి (అసాసిన్) పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారు.

# ప్రతిసారి మగాడిదే తప్పని చెప్పలేం

## : జయం రవికి అండగా మీరా చోప్రా



తమిళ చిత్ర పరిశ్రమలో (కోలీవుడ్) నటుడు జయం రవి విడాకుల వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారడమే కాకుండా, పరిశ్రమలోని ప్రముఖులు ఆయనకు అనుకూలంగా, వ్యతిరేకంగా చీలిపోయే పరిస్థితిని తెచ్చింది. విడాకులు మంజూరయ్యే వరకు తాను సినిమాల్లో నటించనని, తన చిత్రాలను విడుదల చేయనివ్వనని జయం రవి ప్రకటించడం, పెళ్లయిన నాటి నుంచి తాను నరకం అనుభవించానని మీడియా ముందు కన్నీరు పెట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.దీనికి తోడు, జయం రవితో లింక్ చేస్తూ ప్రచారంలోకి వచ్చిన గాయని కెనీషా.. నాటకీయంగా ఆయనతో తన అనుబంధానికి ఫుల్ స్టాప్ పెట్టేశానని ప్రకటించింది. మరోవైపు జయం రవి భార్య ఆర్తి 'నిద్రపోతున్న సింహాన్ని లేపవద్దు' అంటూ హెచ్చరించడం, ఆమెకు సీనియర్ నటి ఖుష్బూ మద్దతుగా నిలవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ఒకప్పటి కథానాయిక మీరా చోప్రా జయం రవికి బాసటగా నిలుస్తూ సోషల్ మీడియా వేదికగా రంగంలోకి దిగడం ఆసక్తికరంగా మారింది. జయం రవితో సౌత్ సినిమాల్లో నటించే సమయం నుంచి తనకు మంచి పరిచయం ఉందని మీరా చోప్రా గుర్తుచేసుకున్నారు. జయం రవి విడాకుల వార్తలపై స్పందిస్తూ.. "ప్రతిసారి తప్పు మగవాడిదే అని చెప్పలేం. మహిళల పక్షాన ఉన్న చట్టాలను కొందరు దుర్వినియోగం చేస్తున్న సందర్భాలను కూడా నేను చూశాను. కాబట్టి పురుషుడి వైపు ఉన్న వాదనను కూడా వినాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాకు తెలిసినంత వరకు జయం రవి చాలా మంచి వ్యక్తి. ఆయన విషయంలో నిజం గెలుస్తుందని, న్యాయం దక్కుతుందని ఆశిస్తున్నాను" అని ఎక్స్ వేదికగా జయం రవికి పూర్తి మద్దతు ప్రకటించారు.మీరా చోప్రా సినీ నేపథ్యం: దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఎస్.జె. సూర్య దర్శకత్వంలో వచ్చిన 'అన్బే ఆరుయిరే' చిత్రంతో మీరా చోప్రా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత తెలుగులో 'బంగారం', 'వాన' వంటి పలు చిత్రాల్లో నటించి మెప్పించారు. గతంలో ఒక సినిమా దర్శక, నిర్మాతలపై ఆమె చేసిన పోరాటం అప్పట్లో మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ఆ తర్వాత దక్షిణాది చిత్రాలకు దూరమై బాలీవుడ్ (హిందీ) వైపు దృష్టి సారించిన ఆమె, ఇటీవల విడుదలైన సైలెంట్ మూవీ 'గాంధీ టాక్స్'కు నిర్మాణ భాగస్వామిగా కూడా వ్యవహరించారు.

# బాలయ్య సినిమాలో మంచు మనోజ్..


## తన గాడ్ ఫాదర్ అంటూ మనోజ్ భావోద్వేగం



నందమూరి బాలకృష్ణ, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'చీదీఖ-111' నుంచి టాలీవుడ్‌ను ఊపేసే ఒక సెన్సేషనల్ అప్‌డేట్ బయటకు వచ్చింది. గతంలో వీరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరోవైపు, నటుడు మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి ఆహ్వానిస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమవడంపై మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన జీవితంలో ఎంతో ఆశగా కోరుకున్న అత్యంత ప్రత్యేకమైన బహుమతి ఈ పుట్టినరోజున లభించిందని, తన గాడ్ ఫాదర్, లయన్ నందమూరి బాలకృష్ణతో కలిసి నటించాలనే ఎన్నో ఏళ్ల నిరీక్షణ, కల ఈ సినిమాతో నిజమవుతోందని రాసుకొచ్చారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు చేసినా బాలయ్య అన్నతో, గోపీచంద్ మలినేని గారితో ఉన్న అనుబంధం వల్ల ఈ సినిమా తన హృదయంలో ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే థియేటర్లలో ప్రేక్షకులకు ఒక పెద్ద పండగ లాంటి విందు ఉండబోతోందని, చూసే ప్రతి క్షణం ఈ నిరీక్షణకు తగినట్టుగా ఉంటుందని అభిమానులకు మనోజ్ పక్కా ప్రామిస్ చేశారు. అయితే, ఈ సినిమాలో మనోజ్ పోషిస్తున్న పాత్రపై చిత్ర బృందం ఇంకా సస్పెన్స్ కొనసాగిస్తున్నప్పటికీ, ఆయన ఒక పవర్‌ఫుల్ విలన్ పాత్రలో బాలయ్యను ఢీకొట్టబోతున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో 'మిరాయ్', 'భైరవం' వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతో వరుస విజయాలు అందుకున్న మనోజ్... ఇప్పుడు బాలకృష్ణలాంటి అగ్ర హీరో సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. గతంలో మనోజ్ నటించిన 'ఊ కొడతారా.. ఉలిక్కి పడతారా' చిత్రంలో బాలయ్య ఒక పవర్‌ఫుల్ రోల్ చేయగా, ఇప్పుడు బాలయ్య సినిమా కోసం మనోజ్ ఏకంగా విలన్‌గా రంగంలోకి దిగడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను డబుల్ చేసింది.

# లెహంగా సోయగాలతో మైమరపిస్తున్న నభా నటేష్!






ఇటు తమ అందాలను ఆరబోయడమే కాకుండా అటు తమ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను కూడా చేపడుతూ సోషల్ మీడియాలో మరింత బిజీ అయిపోయారు సెలబ్రిటీలు. ఒకరి తర్వాత ఒకరు తమ అందాలను ఆరబోయడమే కాకుండా.. ఒకరిని మించి మరొకరు గ్లామర్ డోస్ పెంచి మరీ కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తున్నారు. అలాంటి వారిలో నభా నటేష్ కూడా ఒకరు. అందం, అభినయంతో, నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో మరింత యాక్టివ్ అయిపోయింది. రోజుకొక ట్రెండీ అవుట్ ఫిట్ తో దర్శనమిస్తూ గ్లామర్ వలకబోస్తూ కుర్రాళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.

అందులో భాగంగానే తాజాగా మరోసారి లెహంగా అందాలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధం అయిపోయింది ఈ ముద్దుగుమ్మ. సియా ఫ్యాషన్ బొటిక్ డిజైన్ చేసిన ఆరెంజ్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా మనోజ్ఞ గొల్లపూడి స్టైలింగ్ తో తన లుక్ ను మరింత పర్ఫెక్ట్ గా మార్చుకుంది. ప్రముఖ ఫోటోగ్రాఫర్ సందీప్ క్లిక్ మనిపించిన ఈ ఫోటోలలో మరింత అందంగా కనిపిస్తోందని చెప్పవచ్చు. హెవీ బ్యాంగిల్స్ ధరించిన ఈమె.. చెవి దిద్దులతోపాటు దానికి కాంబినేషన్లో సింపుల్ నెక్ చౌకర్ ను ధరించి ఆకట్టుకుంటుంది. మొత్తానికైతే కాటుక కళ్ళతో ఆకట్టుకున్న ఈమె లెహంగా సోయగాలతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా "పురాణం.. అద్భుతాలతో నిండిన కథ" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ఇక ప్రస్తుతం నభా షేర్ చేసిన ఈ లెహంగా గ్లామర్ పిక్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.చిక్ మంగళూరు జిల్లాకి చెందిన నభా నటేష్ బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేసి మోడల్ గా తన కెరీర్ ను మొదలుపెట్టింది. 2015లో శివరాజ్ కుమార్ తో కలిసి వజ్రకాయ అనే కన్నడ చిత్రం ద్వారా నటిగా అరంగేట్రం చేసిన ఈమె.. తెలుగులో మాత్రం నన్ను దోచుకుందువటే అనే చిత్రం ద్వారా ప్రేక్షకులను పలకరించింది. ఆర్ఎస్ నాయుడు దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా నటించిన ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఇకపోతే ఈమెకు మంచి గుర్తింపును అందించిన చిత్రం మాత్రం ఇస్మార్ట్ శంకర్. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా నటించిన ఈ సినిమాలో ఈమెతో పాటు నిధి అగర్వాల్ కూడా మరో హీరోయిన్గా నటించి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. చివరిగా డార్లింగ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈమె తాజాగా నిఖిల్ తో స్వయంభు, విరాట్ కర్ణతో నాగబంధం, అలాగే టైసన్ నాయుడు అనే చిత్రాలలో నటిస్తోంది. ముఖ్యంగా స్వయంభు సినిమా పీరియడ్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు త్వరలో రానుండగా.. అటు అభిషేక్ నామా దర్శకత్వంలో వస్తున్న నాగబంధం సినిమా కూడా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే టైసన్ నాయుడు సినిమాలో కూడా నటిస్తోంది. ఏదేమైనా వరుస పాన్ ఇండియా చిత్రాలలో నటిస్తూ పాన్ ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకోవాలని ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ.

# మినీ స్కర్ట్ లో హీట్ పుట్టించిన కృతి సనన్!



బాలీవుడ్ బ్యూటీగా, సినీ ప్రేక్షకుల క్రష్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న కృతి సనన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో, నటనతో ఆకట్టుకుంటున్న ఈ చిన్నది ప్రస్తుతం బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయింది. అందులో భాగంగానే కాక్ టెయిల్ 2 సినిమాలో రష్మిక మందన్న తో పాటు మరో హీరోయిన్గా నటించిన ఈ ముద్దుగుమ్మ.. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్ అయిపోయింది. అందులో భాగంగానే భిన్నమైన వస్త్రాలు ధరించి తన ఫ్యాషన్ లుక్ తో అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్ ను కూడా ఈ విధంగా చేపట్టింది.మినీ స్కర్ట్ లో కృతి అందాలు.. అలా ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటున్న కృతి సనన్ తాజాగా మినీ స్కర్ట్ ధరించి ఆకట్టుకుంది . వైట్ కలర్ స్లీవ్ లెస్ క్రాప్ టాప్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో ఫ్లవర్స్ తో డిజైన్ చేసిన మినీ స్కర్ట్ ధరించి హీట్ పుట్టిస్తోంది. ముఖ్యంగా ఫోటోలకు ఫోజులిచ్చిన తీరు, ఆమె చూపులకు అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా ఇప్పటివరకు ఈమె చేసిన ఫోటో గ్యాలరీలన్నింటికీ ఇది కాస్త భిన్నం అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. జుట్టును వేవ్స్ రూపంలో వదిలేసిన ఈమె సింపుల్ చైన్ తో నెక్ ను ఫుల్ ఫిల్ చేసింది. మొత్తానికి అయితే తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా మినీ స్కర్ట్ లో అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది కృతి సనన్. సినిమా సాంగ్ రిలీజ్ ఈవెంట్లో హొయలు.. విషయంలోకి వెళ్తే.. ఇటీవల కాక్ టెయిల్ 2 నుండి ఇటీవల "ఆగ్ తో కాఫీ లగ్నే వాలీ హై" అనే పాటను త్వరలో రిలీజ్ చేయబోతున్నారు. ఈ మేరకు ఒక ఈవెంట్ నిర్వహించగా అందులో ఈ లుక్కులో దర్శనమిచ్చి ఆకట్టుకుంది.. పైగా ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేయడంతో అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. 2012లో విడుదలై బాలీవుడ్లో మంచి ప్రేక్షక ఆదరణ పొందిన కాక్ టెయిల్ చిత్రానికి సీక్వెల్ గా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. షాహిద్ కపూర్ హీరోగా వస్తున్న ఈ చిత్రంలో కృతి సనన్ తో పాటు రష్మిక మందన్న కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. హోమి అడజానియా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా స్నేహం, ప్రేమ, ఆధునిక సంబంధాల భావోద్వేగాల కలయికలో జూన్ 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. అటు ముంబైలో వరుస ప్రమోషనల్ కార్యక్రమాలను చేపడుతూ సినిమాను ఆడియన్స్ లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు చిత్ర బృందం.

# రామ్ చరణ్ తో తన జోడీని చిరంజీవి–శ్రీదేవి

## కాంబోతో పోల్చిన జాన్వీ కపూర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న నటి జాన్వీ కపూర్, ముంబైలో సోమవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చరణ్‌తో తన జోడీపై ప్రేక్షకులు పెట్టుకున్న అంచనాల గురించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ మాట్లాడుతూ, "మా ఇద్దరి మధ్య ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉందని నేను అర్థం చేసుకోగలను. గతంలో చిరంజీవి గారు, మా అమ్మ శ్రీదేవి ఆన్ స్క్రీన్ జోడీని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు మమ్మల్ని వెండితెరపై చూడాలని వారు ఆసక్తిగా ఉన్నారు. ఇంత ప్రత్యేకమైన చిత్రంలో అతడితో కలిసి పనిచేయడం ఒక అద్భుతంలా అనిపించింది. అతడు నిజంగా అత్యుత్తమ వ్యక్తి" అని తెలిపారు.చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానాపై కూడా జాన్వీ ప్రశంసలు కురిపించారు. "మేము రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాం. బుచ్చి గారు చూడటానికి చాలా అమాయకంగా కనిపిస్తారు, కానీ నిజానికి ఆయన అలా కాదు. ఇండియాలోనే ఆయన రౌడీయెస్ట్ డైరెక్టర్. నిజాయతీగా చెప్పాలంటే ఆయన నన్ను ఎన్నో విధాలుగా మార్చారు. నాకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యారు. రోజులో ఒక్కసారైనా ఆయనకు ఫోన్ చేసి మాట్లాడాల్సిందే" అని ఆమె వివరించారు. ఈ చిత్రంలో దివ్యేందు, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.